క్లుప్తంగా

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ పొందాలి

మధిర: వ్యాపారం చేసే వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని వ్యాపారాలను నిర్వహించే వివిధ దుకాణాలను తనిఖీ చేసి ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. నూతనంగా వ్యాపారం నిర్వహించేవారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. లేకపోతే జరిమాన విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: ఆరోగ్య జాగ్రత్తలపై సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, రేగళ్లపాడు గ్రామాల్లో బుధవారం కళాజాత నిర్వహించగా.. పెనుబల్లిలోని లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలోని లింగగూడెంలో ఆరెంపుల సతీష్ కళా బృందంచే నిర్వహించిన కళాజాత అందరిని ఆకట్టుకుంది. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు కాన్పులు చేయించుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అవినాష్, హెచ్ఎస్ రామారావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు కవిత, అనిత, ఏఎన్ఎంలు, కళాజాత బృందం పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే



రాష్ట్ర మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి.. నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

మధిర: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే నాణ్యమైన విద్య ఉంటుందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ అన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం బుధవారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. డిగ్రీలో వివిధ కోర్సుల్లో చేరగోరు విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. కాలేజీలో విశాలమైన క్రీడాస్థలం, అందుబాటులో ఇండోర్ స్టేడియం, డిజిటల్ క్లాస్‌రూమ్‌లతో పాటు హాస్టల్‌లో వసతి, గ్రాంథాలయం ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం దోస్త్ ద్వారా ఏ విధంగా అడ్మిషన్ పొందాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శీలం ఇందిర, సుజాత, అఫ్రోజ్, అనిత, జ్యోతి, వెంకటలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

తల్లాడ: మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) సిబ్బంది గురువారం ఆందోళన చేశారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ.. తల్లాడ ఎంపీఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్ కోటయ్య, సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్ఎస్ రాజు, రవి, ఆగస్టీన్, స్వప్న, కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, జమలాపురం గ్రామాల్లో బుధవారం మొత్తం మూడు 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెం సబ్‌స్టేషన్ ఏఈ అనూష మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు గానూ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య, లైన్‌మెన్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కార్పెంటర్లను ఆదుకోవాలి

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం కార్పెంటర్లకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని సత్తుపల్లి కార్పెంటర్ల అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్పెంటర్లకు సబ్సిడీపై రుణాలు, పనిముట్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు లక్ష్మణాచారి, ఉపాధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి హరీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ బాబా, కోశాధికారి అప్పాచారి, లక్ష్మీనర్సయ్య, రామకృష్ణ, మోహనాచారి, నాగేంద్రాచారి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- అవగాహనపై రవాణాశాఖ దృష్టి
- 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

సంవత్సరం	జిల్లాలో రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	701	233	648
2024	785	281	629

సత్తుపల్లిటౌన్: కరోనా తర్వాత వాహనాల సంఖ్య పెరిగింది.. జిల్లాలో దాదాపు ఇంటికో వాహనం ఉంది. రాకపోకలు గణనీయంగా పెరగటంతో రద్దీ తీవ్రతరమైంది. నిబంధనలు పాటించడంలో మాత్రం తమకేమీ సంబంధం లేదనుకుంటూ.. అవగాహన రాహిత్యంతో వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారి ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జనవరి 11 నుంచి 17వ వరకు వారోత్సవాలు, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 31వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో నిత్యం జరిగే ప్రమాద స్థలాలను బ్లాక్ స్పాట్‌లుగా అధికారులు గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అదే విధంగా అతిపెద్ద ప్రజారవాణా ఆర్టీసీతో పాటు రవాణా శాఖ ఆధ్వర్యాన విస్తృతంగా రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- మూల మలుపుల వద్ద వేగాన్ని తగ్గించాలి.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్ట్ ధరించాలి.
- మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ వద్దు.. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు పెద్ద వాహనాలకు దూరంగా ఉండాలి.
- ఓవర్‌టేక్ చేసేటప్పుడు ముందూ, వెనుక వచ్చే వాహనాలను గమనించాలి.
- వాహనంలో పరిమితికి మించి ఎక్కించుకోవద్దు.
- పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు
- వాహన డ్రైవర్లకు సరిపడా నిద్ర, విశ్రాంతి అవసరం.
- వాహన కండిషన్, బ్రేకులు, టైర్లు ఇతర విడిభాగాలు పరిశీలిస్తుండాలి.
- హైవేలపై వాహనం మరమ్మతులకు గురైతే రోడ్డుపై నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వాహనం రోడ్డుపై నిలపాల్సి వస్తే రేడియం స్టిక్కర్లు ఉండాలి. పార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి.
- సిగ్నల్ క్రాస్ చేసి వెళ్లొద్దు..
- రోడ్డు భద్రత నియమాలు తు.చ. తప్పకుండా పాటించాలి.

విస్తృతంగా అవగాహన



రహదారి ప్రమాదాలతో ప్రాణ నష్టం జరగకూడదనే ప్రభుత్వం లక్ష్యం మేరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. అందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

– జేఎస్.శ్రీనివాసరావు, ఎంవీఐ, సత్తుపల్లి

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు..



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

వైరా: బస్సులు, లారీలు నడిపే డ్రైవర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని వైరా ఎస్సై వంశీకృష్ణ, భాగ్యరాజా, వైరా ఎంవీఐ వరప్రసాద్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వైరాలో డ్రైవర్లు, వాహన యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. అందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ రవిచంద్ర, కార్ల అసోసియేషన్ సభ్యులు రేచర్ల రామారావు, ఉపేందర్, బాషా, శ్రీనివాసరావు, శ్రీను, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు..



మాట్లాడుతున్న సత్తుపల్లి ఏఎంవీఐ దినేష్

సత్తుపల్లిరూరల్: వేగంకన్నా ప్రాణం ఎంతో విలువైనదని.. రోడ్డు భద్రత మనందరి బాధ్యత కావాలని సత్తుపల్లి సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గీతాంజలి విద్యాలయంలో ప్రిన్సిపాల్ చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ తరచూ ప్రమాదాలకు కారకులయ్యే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఆత్మ కమిటీ పాలకవర్గం

మధిర: రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు (కోటి) తెలిపారు. బుధవారం మధిర రైతు వేదికలో మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు మిట్టపల్లి సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంతరం జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్లుగా కొప్పుల గోవిందరావు, నల్లమోతు సత్యనారాయణను ఎన్నిక చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సాయి దీక్షిత్, వినయ్ కుమార్, సాయి శివ, మానస, వేణు యాదవ్, ఏఈఓలు అమృత, గురుమూర్తి, సింధూర్, జిష్ణు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 8మందికి ఆత్మ డైరెక్టర్ పదవులు

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ఆత్మకమిటీ డైరెక్టర్లుగా ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురు కాంగ్రెస్ నాయకులకు, టీడీపీకి చెందిన ఒకరికి మొత్తం 8 మందికి చోటు దక్కింది. ఎర్రుపాలెం మండల కేంద్రానికి చెందిన షేక్ ఇస్మాయిల్, కంచర్ల వెంకటనర్సయ్య, కొత్తపాలెం గ్రామానికి చెందిన పాండురంగారావు, మీనవోలులో పిల్లి బోస్, గుంటుపల్లిగోపవరంలో సామినేని హనుమంతరావు, పెద్దగోపవరంలో ఇనపనూరి వసంతరావు, ఇనగాలికి చెందిన వెంకటరెడ్డి, నారాయణపురంలో దోమందుల సామేలులకు ఆత్మ కమిటీలో డైరెక్టర్లుగా స్థానం లభించింది. తమకు పదవులు కల్పించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్కమార్కకు డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

మధిర నియోజకవర్గానికి అదనంగా ఏఎంసీలు

మధిర: మధిర నియోజకవర్గంలో నూతనంగా రెండు మార్కెట్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో ముదిగొండ, చింతకాని కేంద్రాలుగా రెండు నూతన మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మార్కెట్ కమిటీలో ఉన్న ముదిగొండ మండలాన్ని విడదీసి ముదిగొండ కేంద్రంగా నూతన మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. అదేవిధంగా చింతకానికి మరో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేశారు. చింతకాని మండలం ప్రస్తుతం ఖమ్మం మార్కెట్ కమిటీ పరిధిలో ఉంది. మధిర నియోజకవర్గంలో ప్రస్తుతం మధిర కేంద్రంగా మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలతో మార్కెట్ కమిటీ కొనసాగుతుంది. దీనికి అదనంగా మరో రెండు మార్కెట్ కమిటీలు ఏర్పాటు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ వ్యర్థాల తొలగింపు

వైరా: వైరా మున్సిపాలిటీలోని గంధం టవర్స్‌లోని వ్యర్థాలు రోడ్డు మీదకు వచ్చి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉండడంతో వైరా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణు పర్యవేక్షణలో సిబ్బంది వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో సంబంధిత యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబండిలో వేయాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిబాబు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు ఉదయం వార్డులను, వీధులను పరిశీలించారు. అయ్యగారిపేట రోడ్‌లోని ఓ సూపర్‌మార్కెట్ ఎదుట రోడ్డుపై చెత్త వేసినందుకు కమిషనర్ మందా రవిబాబు రూ.2వేలు జరిమానా విధించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కొణిజర్ల: పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమునగాలలో నిర్వహించిన రైతు సంఘం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతులకు భూముల పట్టాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాదా బైనామాలకు పట్టాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, మోహన్‌రావు, జయరాజు, భద్రయ్య, రమేష్, రాజారత్నం సంసోన్, తదితరులు పాల్గొన్నారు.

‘వేల గొంతులు.. లక్ష డప్పులు’ సభను జయప్రదం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తల్లాడ: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు, లక్ష డప్పుల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సదర్భంగా బుధవారం స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద నుంచి ప్రదర్శన ప్రారంభమై తల్లాడ ప్రధాన రహదారుల్లో డప్పుల మోత, ఎమ్మార్పీఎస్ జెండాలతో ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ సదర్భంగా తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వరరావు.. సభకు వెళ్లేందుకు గానూ.. మండలంలోని 27 పంచాయతీలకు రూ.5వేలు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్నేపల్లి అశోక్ మాదిగ, నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు, మాగంటి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్ల సమస్యలు పరిష్కరించాలి



జేవీఆర్ఓసీ పీఓ ప్రహ్లాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సత్తుపల్లి: సింగరేణి క్వార్టర్స్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్‌ను బుధవారం హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుల పిల్లల కోసం సీబీఎస్ఈ సిలబస్ స్కూల్, కమ్యూనిటీహాల్, ఓపెన్‌జిమ్, మహిళలకు వాకింగ్‌ట్రాక్, స్విమ్మింగ్ పూల్, లైటింగ్ పెట్టించాలని కోరారు. అదే విధంగా సింగరేణి క్వార్టర్స్ ఎదురుగా ఉన్న రోడ్డుమీద దహన సంస్కారాలు నిర్వహిస్తున్నందున వాటిని దూరంగా నిర్వహించేలా, ప్రహారీ నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ వరికూటి శ్రీనివాసరావు, ఎండి అజ్గర్‌ఖాన్, ఎండి నసీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి



హైకోర్టు జడ్జికి వినతిపత్రం ఇస్తున్న వైరా న్యాయవాదులు

వైరా: వైరా, కొణిజర్ల, తల్లాడ, చింతకాని, ఏన్కూరు మండలాల ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందజేసేందుకు వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు తెలంగాణ హైకోర్టు జడ్జి, ఖమ్మం జిల్లా పోర్టు పోలియో జడ్జి సాయి సుధకు వినతిపత్రం అందించారు. ఖమ్మంలో రెండో సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభోత్సవానికి జడ్జి సాయిసుధ రావడంతో.. అసోసియేషన్ సభ్యులు ఆమెను కలిసి మాట్లాడారు. పలు మండలాల ప్రజలు కోర్టు కేసులకు హాజరు కావడానికి ఖమ్మం, మధిర, సత్తుపల్లి వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని 30 నుంచి 40 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఇతర కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రంగా ఉన్న వైరా మున్సిపాలిటీగా కూడా అభివృద్ధి పథంలో ఉన్నందున వైరాలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్, వైరా న్యాయవాదులు వరదరాజు, నరేష్, కృష్ణమోహన్, నెహ్రూ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఆర్డీఓ నరసింహారావు

ముదిగొండ: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మం ఆర్డీఓ గరిడి నరసింహారావు హాజరై మండలంలోని 87మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు చెక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ముదిగొండకు చెందిన మూడుగుల సాయివర్ధన్ (17) మధిరమండలం కృష్ణాపురం ఎస్సీ గురుకుల కళాశాలలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందడంతో.. రూ.5లక్షల చెక్కును తహసీల్‌లో విద్యార్థి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి



వైరా: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాస్‌లైన్ నాయకులు

వైరా/కొణిజర్ల/కారేపల్లి: ప్రభుత్వం ప్రకటించిన నాలుగు సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం తహసీల్‌లో వైరా, కొణిజర్ల తహసీల్దార్లు కేవీ శ్రీనివాస్, రాములకు వినతిపత్రాలు అందించారు. అదే విధంగా కారేపల్లిలో.. కొమరంభీం సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్, సినిమాహాల్ సెంటర్, అంబేద్కర్ సెంటర్ మీదుగా తహసీల్ వరకు ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింగరేణి తహసీల్ ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎలదండి బాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సీవై పుల్లయ్య, మాస్‌లైన్ కామేపల్లి, కారేపల్లి మండలాల సంయుక్త కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడారు. నాయకులు సీతారాములు, శ్రీను, నాగేశ్వరరావు, మోహనరావు, మహేష్, వైరా సబ్ డివిజన్ నాయకులు అప్పారావు, మండల కార్యదర్శి సీతారాములు, శ్రీను పాల్గొన్నారు.

తల్లాడ/కల్లూరురూరల్: పథకాల అమలులో రాజకీయ జోక్యం తగదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో తల్లాడ తహసీల్‌లో సీనియర్ అసిస్టెంట్ స్టాలిన్‌కు, కల్లూరు తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎస్‌కె.లాల్‌మియా, జి.పుల్లమ్మ, ఆర్.కృష్ణ, నారాయణ, బిక్షం, మాస్‌లైన్ కల్లూరు మండల కార్యదర్శి పుల్లారావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి లాజరు, డివిజన్ నాయకులు జె.మాల్యాద్రి, పట్టణ కార్యదర్శి మంగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కోలేటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాస్‌లైన్ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి.. డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు నాగయ్య, నాగరాజు, నాగసురేష్, నాగేశ్వరరావు, జయరాజు, కోటేశ్వరరావు, ప్రభాకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి రైతు వేదికలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి సాగు యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలాల్లో ప్రయోగాత్మకంగా నేరుగా వెదజల్లే పద్ధతి గురించి వివరించారు. ఈ సందర్భంగా భారతీయ వరి పరిశోధన స్థానం హైదరాబాద్ నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి, వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ.. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు లింగార్షక బుట్టలు ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలో, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కుర్నవల్లి క్లస్టర్ ఏఈఓ త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్



సంగెపు వెంకటేశ్వరరావు

బోనకల్: మండలంలోని మోటమర్రికి చెందిన సంగెపు వెంకటేశ్వరరావుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీలో డాక్టరేట్ లభించింది. సోనో కెమికల్ సింతసిస్ బయోలాజికల్ అస్సయ్ ఆఫ్ సమ్ నోవెల్ ఇండాజోల్ పైరాజోల్, క్వినాజోల్‌నోనే అండ్ ఐసోక్వినోలినోనే డెరివేటివ్స్ అనే అంశంపై డాక్టర్ రమాదేవి, డాక్టర్ కీర్తికుమార్ జైన్‌ల పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనా గ్రంథానికి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

పెనుబల్లి: 108 వాహనంలో మహిళ ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంంంలోని లింగగూడెం గ్రామానికి చెందిన కొప్పుల శిరీషకు బుధవారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో ఆశా వర్కర్ కుమారి 108కి సమాచారం అందించింది. దీంతో వాహన సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గ మధ్యలో ప్రసవించింది. 108లో ఆశా వర్కర్, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేశారు. దీంతో ఆశావర్కర్‌కి, సిబ్బందికి శిరీష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపగా.. గ్రామస్తులు అభినందించారు.

వితరణలు వెల్లువ

విద్యార్థులకు క్రీడా దుస్తులు..

మధిర: మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు బొగ్గుల శ్రీనివాసరెడ్డి అల్లుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నోముల మహిపాల్ రెడ్డి–శ్రీవైష్ణవి దంపతులు సుమారు రూ.50 వేల విలువైన క్రీడా దుస్తులను వితరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించిన దాతలకు, దానికి సహకరించిన పాఠశాల పీడీ శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీవి సాయి కృష్ణమాచార్యులు, శ్రీనివాసరావు, సునీత, భాగ్య శ్రీనివాసరావు, ఇబ్రహీం, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, వరప్రసాద్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారానికి..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నారాయణపురం లూర్ధుమాతా ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. పాఠశాల పూర్వ విద్యార్థులు కర్నాటి లక్ష్మారెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డిలు పిల్లలు బాగా చదువుకోవాలని అల్పాహారానికి ఆర్థిక సాయం అందించనట్లు తెలిపారు. కార్యక్రమంలో కటికి వెంకటేశ్వరరావు, కోశాధికారి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్లు..



మెటీరియల్ అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం ఉన్నత పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులకు స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో.. ఆ సంస్థ కార్యదర్శి చల్లా కోటయ్య స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. దీంతో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం టి.రత్నమ్మ, ఉపాధ్యాయులు దాతను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భానుచందర్, రేమిడిచర్ల జెడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.